క్లుప్తంగా

కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా నిజాముద్దీన్



హుజూర్‌నగర్‌రూరల్ : కాంగ్రెస్ పార్టీ ముస్లిం మైనార్టీ సెల్ సూర్యాపేట జిల్లా కమిటీ అధ్యక్షుడిగా మండలంలోని లింగగిరికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎండీ నిజాముద్దీన్‌ను రెండవసారిగా నియమిస్తూ కాంగ్రెస్ ఆలిండియా ముస్లిం మైనార్టీ కమిటీ చైర్మన్ ఇమ్రాన్ ప్రతాప్‌గరీ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శనివారం నిజాముద్దీన్ స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. తన నియామకానికి సహకరించిన ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి ఆర్.దామోదర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్‌కు ధన్యవాదాలు తెలిపారు. అంతేగాక జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపుకు తీవ్రంగా కృషిచేయనున్నట్లు పేర్కొన్నారు. త్వరలోనే జిల్లాలోని అన్ని మండలాల కమిటీలు నియమించనున్నట్లు తెలిపారు.

స్టడీ మెటీరియల్, ప్యాడ్లు పంపిణీ



విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేస్తున్న దాతలు

మునగాల : మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో పదవ తరగతి విద్యార్థులకు కస్తూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం స్టడీ మెటీరియల్, పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కస్తూరి ఫౌండేషన్ నిర్వాహకుడు, విద్యుత్ శాఖ ఏఈ జిల్లా శంకర్ మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలను ఆత్మస్థైర్యంతో రాసి విజయం సాధించాలని కోరారు. కేజీబీవీ ఎస్‌ఓ సునీత, జిల్లా సుధాకర్, శ్రీకాంత్‌చారి, దేవరశెట్టి నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నడిగూడెం చేరిన ఇంటర్ ప్రశ్నపత్రాలు

నడిగూడెం : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో ఈ నెల 15 నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌కు ఇంటర్ ప్రశ్నపత్రాలు చేరాయి. ఈ సందర్భంగా గురుకుల కళాశాల సీఎస్ విజయలక్ష్మి, డీఓ మహేష్, జూనియర్ కళాశాల సీఎస్ పిచ్చిరెడ్డి, డీఓ బాల బీమారావు రెండు సెట్ల ప్రశ్నాపత్రాలను స్వీకరించారు. మరొక సెట్ ప్రశ్నాపత్రాలు 12న చేరనున్నట్లు అధికారులు తెలిపారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి

హుజూర్‌నగర్ : ప్రభుత్వ భూములను కాపాడాలని కౌన్సిలర్లు జక్కుల వీరయ్య, కోతి సంపత్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలో వారు విలేకరులతో మాట్లాడారు. స్థానిక రిజిస్ట్రేషన్ కార్యాలయం సమీపంలోని ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించి ప్లాట్లుగా చేసి విక్రయిస్తున్నారన్నారు. ఈ విషయంపై అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని దానికి హద్దులు నియమించి బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. ఈమేరకు అధికారులకు వినతిపత్రం అందజేసినట్లు వారు తెలిపారు.

ఆహారపు అలవాట్లపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ పొట్టా కిరణ్‌కుమార్

కోదాడరూరల్ : ఏ ఆహారంలో ఎలాంటి పోషక విలువలు ఉంటాయో విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని పట్టణంలోని మాస్టర్ మైండ్ స్కూల్ ప్రిన్సిపాల్ పొట్టా కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించి ఆహారపు అలవాట్లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రోటీన్స్, విటమిన్స్ ఎక్కువగా ఉండే కూరగాయాలు, పండ్లు, ధాన్యాలు వంటి ఆహారాలను ఎక్కువగా తీసుకోవాలని, బేకరి ఫుడ్స్‌కు పిల్లలను దూరంగా ఉంచాలని తల్లిదండ్రులకు సూచించారు. మంచి ఆహారం తీసుకున్నప్పుడే మానసిక ఎదుగుదల ఉంటుందని తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

గరిడేపల్లి : మండలంలోని కీతవారిగూడెం గ్రామంలో పలువురు లబ్ధిదారులకు స్థానిక ఎమ్మెల్యే చొరవతో మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను శనివారం బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గుగులోతు కృష్ణానాయక్ పంపిణీ చేశారు. కె.చంద్రమ్మకు రూ.60 వేలు, బి.లక్ష్మమ్మకు రూ. 44 వేల విలువ గల చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కీత జ్యోతి రామారావు, హుజూర్‌నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పీడమర్తి అంజి, గుగులోతు శంకర్‌నాయక్, కీత నాగరాజు, ఆనంద్‌బాబు, నాగయ్య, సైదులు తదితరులు ఉన్నారు.

నత్తనడకన డబుల్ రోడ్డు పనులు

- ప్రారంభమై మూడు నెలలు
- రోడ్డుకు ఇరువైపులా వరి సాగు చేయడంతో ఆటంకం
- త్వరితగతిన పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజల వేడుకోలు



కొనసాగుతున్న కొక్కిరేణి డబుల్ రోడ్డు నిర్మాణ పనులు

మునగాల : మండల కేంద్రంలోని జాతీయ రహదారి నుంచి గరిడేపల్లి మండలం కీతవారిగూడెం వరకు చేపట్టిన డబుల్ రోడ్డు నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనులు ప్రారంభమై మూడు నెలలు కావస్తున్నా నేటికీ పూర్తి కాలేదు. దీంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.

రూ. 20 కోట్లు మంజూరు..

కాగా, అనేక సంవత్సరాలుగా కొక్కిరేణి రోడ్డు గుంతలమయం కావడంతో ప్రజలు నరకయాతన అనుభవించారు. దీంతో రహదారిని డబుల్ రోడ్డుగా మార్చాలని పదేళ్లుగా అధికారులకు అనేకసార్లు వినతిపత్రాలు ఇచ్చారు. దీంతో ప్రభుత్వం 18 కి.మీ గల ఈ ఆర్‌అండ్‌బీ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చేందుకు సీఆర్‌ఐఎఫ్ నిధుల నుంచి రూ.20 కోట్ల నిధులు మంజూరు చేసింది. దీంతో మూడు నెలల క్రితం ప్రారంభం అయ్యాయి. 66 అడుగుల వెడల్పు గల ఈ రహదారి గరిడేపల్లి మండల పరిధిలో 8కి.మీ, మునగాల మండల పరిధిలో 10కి.మీ కలిగి ఉన్నది. ఈ రహదారి మీదుగా మునగాల, గరిడేపల్లి, పెన్‌పహాడ్, చిలుకూరు మండలాలకు చెందన 15 గ్రామాల ప్రజలు నిత్యం ప్రయాణిస్తుంటారు.

25 కల్వర్టులు ఏర్పాటు చేయాల్సి ఉండడంతో..

ప్రస్తుతం యాసంగి సీజన్‌లో ఈ రహదారికి ఇరువైపులా రైతాంగం వరిసేద్యం చేపట్టడంతో నిర్మాణ పనులు ముమ్మరంగా సాగడం లేదు. ప్రస్తుతం ఉన్న రోడ్డుకు ఇరువైపుల తవ్వి రోడ్డును వెడల్పు చేయాల్సి రావడం, సుమారు 25 కల్వర్టులు ఉండడం మూలంగా పనులు సాఫీగా సాగడం లేదు. ఈ రోడ్డు పనులు ప్రారంభమై మూడు నెలలు గడుస్తుండగా ప్రస్తుతం మండల పరిధిలోని కొక్కిరేణి, తిమ్మారెడ్డిగూడెం గ్రామాల పరిధిలో కొనసాగుతున్నాయి.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి



కొక్కిరేణి ఆర్‌అండ్‌బీ డబుల్ రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేయాలి. రహదారిని వెడల్పు చేస్తున్న క్రమంలో హద్దులు ఏర్పాటు చేసి రాళ్లు పాతాలి. రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి.

– మేదరమెట్ల వెంకటేశ్వరరావు, సీపీఎం నాయకుడు, కొక్కిరేణి

వచ్చే నెలలో పనులను వేగవంతం చేస్తాం

కొక్కిరేణి డబుల్ రోడ్డు నిర్మాణ పనులను మండల పరధిలోని కొక్కిరేణి, తిమ్మారెడ్డిగూడెం, గణపవరం, మునగాల గ్రామాల సరిహద్దుల లో వచ్చే నెలలో వేగవంతం చేస్తాం. ప్రస్తుతం యాసంగి వరిసాగులో ఉన్నందున కొంత ఆటంకం కలుగుతున్న మాట వాస్తవమే. అసవరమైన చోట మరికొన్ని కల్వర్టులు ఏర్పాటు చేస్తాం.

– బి.సత్యనారాయణ, ఆర్‌అండ్‌బీ ఏఈ

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



చిలుకూరు : ముత్యాలమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్

చిలుకూరు : తెలంగాణలో ఆలయాల అభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. శనివారం పాత చిలుకూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ముత్యాలమ్మ నూతన ఆలయ నిర్మాణానికి ఆ గ్రామస్తులతో కలిసి ఆయన భూమి పూజ చేశారు. అనంతరం ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే రూ.50 వేలు విరాళం అందజేశారు. కాగా పూజా, హోమం కార్యక్రమాల్లో గ్రామస్తులంతా పాల్గొని నవధాన్యాలు సమర్పించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

చిలుకూరులోని రావినారాయణరెడ్డి కాలనీలో ఉపాధి హామీ నిధులు రూ.15 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు జానివియా, సర్పంచ్ కొడారు బాబు, ఎంపీటీసీ బెల్లంకొండ రమణ నాగయ్య, పీఆర్ ఏఈ లక్ష్మారెడ్డి, కార్యదర్శి శోభన్‌బాబు, ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల అభివృద్ధికి కృషి

నడిగూడెం : మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని వల్లాపురంలో ఉర్దూ పాఠశాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గత ప్రభుత్వాల హయాంలో ముస్లింల జీవితాలు దుర్భర స్థితిలో ఉండేవని, టీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చాక వారు అభివృద్ధి చెందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యాతాకుల జ్యోతి, సర్పంచ్ వట్టికూటి చంద్రయ్య, మైనార్టీ నాయకులు అల్తాఫ్ హుస్సేన్, ఇస్సార్, రఫీ, షఫీ, జానీ, మహ్మద్, ఇమామ్, తదితరులు పాల్గొన్నారు.

గురువయ్యకు నివాళి

కోదాడరూరల్ : మండల పరిధిలోని గణపవరానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు కుర్రి మట్టపల్లి తండ్రి గురవయ్య శనివారం మృతి చెందారు. శనివారం ఆయన మృతదేహాన్ని ఎంపీపీ చింత కవితారాధారెడ్డి సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటామని భరోసా కల్పించారు. నివాళులర్పించిన వారిలో సర్పంచ్ శ్రీవిజయ పొట్టా కిరణ్, ఆలయ చైర్మన్ కామిశెట్టి నరసింహారావు, ముడియాల వెంకట్‌రెడ్డి, నరేష్ తదితరులు ఉన్నారు.

రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెప్పాలి



రామలక్ష్మీపురంలో జోడో యాత్ర కరపత్రం ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కోదాడరూరల్ : మాయమాటలతో ప్రజలను మోసం చేస్తూ అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ పార్టీకి రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని గణపవరం, తొగర్రాయి, బీక్యాతండా, రామలక్ష్మీపురం గ్రామాల్లో ఆయన హాథ్‌సే హాథ్ జోడో యాత్రను ప్రారంభించి మాట్లాడారు. రాహుల్ గాంధీ చేపట్టిన జోడో యాత్రతో దేశవ్యాప్తంగా ప్రజల నుంచి విశేష స్పందన వచ్చిందన్నారు. ఈ సారి రాష్ట్రం, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవినీతిలో కూరుకపోయాయని ఆరోపించారు. ఆ పార్టీ నాయకులు ప్రజాసేవ మరిచి సంపదనే లక్ష్యంగా ప్రజలను నిలువునా దోచుకుంటున్నారని విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవూరి వెంకటాచారి, పులి సులోచనరావు, ఇర్ల సీతరాంరెడ్డి, సుమన్‌రెడ్డి, కొప్పుల శ్రీనివాసరెడ్డి, సాగర్‌రెడ్డి, కన్నారెడ్డి, సుభాష్‌రెడ్డి, కాలతిరిపి పాపులు, నరసింహారెడ్డి, లిక్కి వెంకటయ్య, వేనేపల్లి నర్సింహారావు, జడ వెంకటేశ్వర్లు, బాషా, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

23న ఐఎఫ్‌టీయూ జిల్లా మహాసభ



మహాసభ కరపత్రం విడుదల చేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

గరిడేపల్లి : గరిడేపల్లిలో ఈనెల 23వ తేదీన భారత కార్మిక సంఘాల సమైక్య (ఐఎఫ్‌టీయూ) జిల్లా 5వ మహాసభను నిర్వహించనున్నట్లు ఆ యూనియన్ జిల్లా నాయకుడు కామళ్ల శ్రీను తెలిపారు. శనివారం మహాసభల కరపత్రాన్ని మండల కేంద్రంలో విడుదల చేసి మాట్లాడారు. ఐఎఫ్‌టీయూ వివిధ రంగాల్లో పని చేస్తున్న అసంఘటిత రంగ కార్మికుల కోసం రాజీలేని పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నాయని ధ్వజమెత్తారు. గత ఉద్యమాలను సమీక్షించి భవిష్యత్ కార్యచరణ నిర్దేశించేందుకు ఈ మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అసంఘటిత రంగ కార్మికులు మహాసభకు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకురాళ్లు ఉమ, దీనారాణి, నాగమణి, ఇందిరా, ఖాసీంబేగం, నర్సమ్మ, చిన్న, ఉదయగిరి, వెంకటేశ్వర్లు, కనకరావు, గుండు నగేష్, భిక్షం, లచ్చయ్య తదితరులున్నారు.

కోటేశ్వర్‌రావు ఆశయ సాధనకు కృషిచేయాలి

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి



పెంచికల్‌దిన్నలో కోటేశ్వర్‌రావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రంగారెడ్డి, తదితరులు

నేరేడుచర్ల : అమరజీవి నందమూరి కోటేశ్వర్‌రావు ఆశయ సాధన కోసం యువత కృషిచేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పెంచికల్ దిన్న గ్రామంలో జరిగిన నందమూరి కోటేశ్వర్‌రావు సంతాప సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రానున్న కాలం కమ్యూనిస్టులదేనని, ప్రపంచ దేశాలన్ని కమ్యూనిస్టుల వైపే చూస్తున్నాయన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 17వ తేదీ నుంచి 29 వరకు రాష్ట్ర వ్యాప్తంగా మూడు జన చైతన్య యాత్రలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 26న నేరేడుచర్లలో జన చైతన్య యాత్ర సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామంలో ఇటీవల మృతి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు చిన వెంకులు కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన నేరేడుచర్ల మాజీ సర్పంచ్ కొణతం పెద వెంకట్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ నాయకులు కోదమగుండ్ల నగేష్, మండల కార్యదర్శి సిరికొండ శ్రీను, మర్రి నాగేశ్వర్‌రావు, తిరుపతయ్య, మధుబాబు, రాములమ్మ, మురళి, అప్పారావు, రాణమ్మ, శ్రీధర్, రవి, శ్రీను తదితరులున్నారు.

హాల్‌టికెట్లు ఇవ్వని కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

మునగాల : పరీక్షల సమయంలో విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్న కళాశాలలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు పుల్లూరి సింహాద్రి శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇంటర్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ ఎగ్జామ్స్ ప్రారంభమైన నేపథ్యంలో కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు ఫీజులు చెల్లించలేదనే సాకుతో హాల్ టికెట్స్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. తక్షణమే అటువంటి కళాశాలలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం సకాలంలో ఫీజు రియింబర్స్‌మెంటు చెల్లించలేని మూలంగానే విద్యార్థులు ఈ విధమైన ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో ఏ ఒక్క విద్యార్థి కళాశాల యాజమాన్యాల కారణంగా పరీక్ష రాయకపోయిన, మానసిక ఇబ్బందులకు గురైన ప్రభుత్వమే బాధ్యత వహించాలని కోరారు.

లిక్కర్ స్కాం చర్చను దారి మళ్లించేందుకు ప్రయత్నం

కోదాడరూరల్ : లిక్కర్ స్కాంలో ఇరుకున్న బీఆర్‌ఎస్ నాయకురాలు కవిత అవినీతిపై చర్చను దారి మళ్లించేందుకే ఆ పార్టీ ప్రయత్నిస్తుందని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కనగాల నారాయణ, రాష్ట్ర నాయకురాలు నూనె సులోచన శనివారం ఓ ప్రకటనలో ఆరోపించారు. ఈడీ విచారణలో నిజానిజాలు తెలుస్తాయని లిక్కర్ స్కాంలో వాటాలు లేకపోతే బీఆర్‌ఎస్ నాయకులకు భయమెందుకన్నారు. రాష్ట్రంలో మహిళలపై దాడులు జరుగుతుంటే పట్టించుకోని నాయకులు కవితను అరెస్ట్ చేస్తారని రోడ్డు మీదకు రావడమేంటని ప్రశ్నించారు. తప్పుచేస్తే ఎంతటి వారికైన శిక్ష తప్పదన్నారు. అదే విధంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ వాఖ్యాలపై సుమోటోగా కేసు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఆయనపై చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలన్నారు.

వజ్రోత్సవాన్ని విజయవంతం చేయాలి

గరిడేపల్లి : మండలంలోని పొనుగోడు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వజ్రోత్సవ సన్నాహక సమావేశం శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యగ్గడి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రిటైర్డ్ జడ్జి ఎం.కాంతయ్య, రిటైర్డ్ ఉపాధ్యాయులు ఎ.కృష్ణారెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వజ్రోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రతి బ్యాచ్ నుంచి ఇద్దరు చొప్పున కమిటీ సభ్యులను ఎన్నుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జోగు సరోజనమ్మ, పూర్వ విద్యార్థులు సత్యనారాయణ, గన్నా లింగయ్య, సీతారాంరెడ్డి, పిచ్చిరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

ఎంపీ బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం



నేరేడుచర్లలో బండి సంజయ్ దిష్టిబొమ్మతో నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు



కోదాడరూరల్ : బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఎంపీపీ కవిత, నాయకులు



హుజూర్‌నగర్‌లో బీఆర్‌ఎస్ నాయకుల నిరసన

కోదాడరూరల్ : కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలను ప్రశ్నిస్తే కేసులు పెడతారా అని ఎంపీపీ చింత కవితారాధారెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ కవితపై బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ శనివారం పట్టణంలోని ఖమ్మం క్రాస్ రోడ్‌లో బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్ని కేసులు పెట్టినా బీజేపీ ప్రభుత్వంపై తమ పోరాటం ఆగదని, దేనికైనా బీఆర్‌ఎస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థలన్నీ మోడీ చేతిలో కీలు బొమ్మలుగా మారయని విమర్శించారు. బీజేపీ మంత్రులు, నాయకులు వేల కోట్ల కుంభకోణాలు చేస్తూ దేశాన్ని దోచుకుంటుంటే ఎందుకు కేసులు పెట్టడం లేదని ఆమె ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ బీఆర్‌ఎస్ పార్టీ పెట్టిన తర్వాత బీజేపీ నాయకులకు భయం పట్టుకొని ఇలాంటి కేసులు పెడుతున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మందలపు కృష్ణకుమారి, మున్సిపల్ వైస్ చైర్మన్ వెంపటి పద్మ, వైస్ ఎంపీపీ మల్లెల రాణి, రోజారమణి, పీఏసీఎస్ చైర్మన్‌నలజాల శ్రీనివాసరావు, ఇమ్రాన్, గంధం పాండు, సత్యవతి, సైదాబీ ఉన్నారు.

బండి సంజయ్ వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

నేరేడుచర్ల : బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై కరీంనగర్ ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా శనివారం నేరేడుచర్ల ప్రధాన కూడలిలో కోదాడ- జడ్చర్ల ప్రధాన రహదారిపై బండి సంజయ్ దిష్టిబొమ్మను బీఆర్‌ఎస్ పట్టణ, మండల పార్టీల ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు అరిబండి సురేష్‌బాబు మాట్లాడుతూ బండి సంజయ్ అహంకార ధోరణితో నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని అన్నారు. తక్షణమై బండి సంజయ్ క్షమాపణ చెప్పి తాను చేసిన వాఖ్యాలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చందమళ్ల జయబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ నాగండ్ల శ్రీధర్ బాబు, నియోజకవర్గ నాయకుడు వల్లంశెట్ల రమేష్‌బాబు, గ్రంథలయ చైర్మన్ గుర్రం మార్కెండేయ, సింగిల్ విండో చైర్మన్ అనంత్ శ్రీనివాస్ గౌడ్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు సుదర్శన్, యూత్ అధ్యక్షుడు హిందూజా, మల్లయ్య, నాగరాజు, కళావతి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

బండి సంజయ్‌ను అరెస్టు చేయాలి

హుజూర్‌నగర్ : తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవితపై అనుచిత వాఖ్యలు చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ని వెంటనే అరెస్టు చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్‌చేశారు. కవితపై బండి సంజయ్ వ్యాఖ్యలను నిరసిస్తూ శనివారం పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించి అనంతరం బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు దొంతగాని పద్మ, మున్సిపల్ వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వరరావు, నాయకులు హరిబాబు, ప్రదీప్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ క్షమాపణ చెప్పాలి

మునగాల : బీఆర్‌ఎస్ పార్టీ నాయకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ బహిరంగ క్షమాపణ చెప్పాలని బీఆర్‌ఎస్ మండల నాయకులు డా.వేమూరి సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ కవితపై బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. ఒక జాతీయ పార్టీకి అధ్యక్షుడిగా, గౌరవ పార్లమెంటు సభ్యుడిగా ఉన్న బండి సంజయ్ ఒక మహిళా ప్రజాప్రతినిధిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం అవమానకరమన్నారు. ఇక ముందైన బీజేపీ నాయకులు సిద్ధాంతాలకు లోబడి మాట్లాడాలని సత్యనారాయణ హితవు పలికారు.

బెదిరించిన వ్యక్తిపై కేసు

హుజూర్‌నగర్ : ఎస్సీ, ఎస్టీ కేసు పెడతానని బెదిరించి, అంతు చూస్తానన్న వ్యక్తిపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ వెంకటరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన తేజావత్ సైదులు ఇటీవల కౌన్సిలర్ త్రివేణి తండ్రి వడ్డాణపు శ్రీనుకి ఫోను చేసి సీఐటీయూ స్థలం విషయంలో అడ్డొస్తుందని, మాజోలికివస్తే ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టి జైలుకు పంపిస్తామని బెదించాడు. దీంతో కౌన్సిలర్ త్రివేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుదాం

హుజూర్‌నగర్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం తప్పదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగారపు పాండు అన్నారు. శనివారం పట్టణంలోని అమర వీరుల స్మారక భవనంలో నిర్వహించిన హుజూర్‌నగర్ రూరల్ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక, కర్షక రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 25, 26 తేదీల్లో జనచైతన్య యాత్రలు నిర్వహించనున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లో మార్చి 29న నిర్వహించనున్న ముగింపు సభకు కార్మికులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. సీపీఎం నాయకులు వెంకటచంద్ర, బ్రహ్మం, హుస్సేన్, వీరయ్య, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ప్రమాదకరంగా డ్రెయినేజీ



వల్లాపురంలో ప్రమాదకరంగా ఉన్న డ్రెయినేజీ

నడిగూడెం : మండల పరిధిలోని వల్లాపురం బస్టాండ్ సెంటర్‌లో డ్రెయినేజీ ప్రమాదకరంగా ఉంది. అయితే ఈ డ్రెయినేజీని రెండు నెలల క్రితం నిర్మించారు. కానీ రహదారి మధ్యలో గూనలు ఏర్పాటు చేయలేదు. దీంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. గురువారం ఇద్దరు వృద్ధులు కింద పడి గాయాలపాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. అలాగే అసంపూర్తిగా ఉన్న డ్రెయినేజీలో మురుగు నీరు నిల్వ ఉండి దోమలు సంచారం చేస్తున్నాయి. ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలిపినా స్పందన కరువైందని ఆరోపిస్తున్నారు.

పాఠశాలలో ఘనంగా వీడ్కోలు సమావేశం



నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని గ్రీన్‌ఉడ్ పాఠశాలలో శనివారం 9, 10, తరగతుల విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చైర్మన్ తుమ్మా మర్రెడ్డి, మారయ్య, ఏవీకృష్ణారావు, రాజారెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఎంచుకోవాలి



సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంపీపీ పార్వతి, తదితరులు

మఠంపల్లి : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఎంచుకుని విజయం సాధించాలని ఎంపీపీ ముడావత్ పార్వతీకొండానాయక్ అన్నారు. శనివారం మండలంలోని బక్కమంతులగూడెం వద్ద గల కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో నిర్వహించిన 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచిపేరు సంపాదించి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా స్వామివారి కల్యాణం



కల్యాణ వేడుకలో పాల్గొన్న దంపతులు

కోదాడరూరల్ : మండల పరిధిలోని ఎర్రవరంలో నూతనంగా వెలసిన శ్రీ బాల ఉగ్రలక్ష్మీనారసింహస్వామి కల్యాణ వేడుకను శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కల్యాణ వేడుకలో గ్రామానికి చెందిన దంపతులు పీటలపై కూర్చున్నారు. రెండో రోజు కూడా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కాగా వారికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నలజాల జగన్నాథం, సర్పంచ్ వీరేపల్లి సుబ్బారావు, బాషబోయిన భాస్కర్‌రావు అరుణ దంపతులు, రావుల వెంకటేశ్వర్లు, లతీఫ్, నెట్టెం నాగేంద్ర, సుల్తానీ వెంకటేశ్వర్లు, వల్లెపు సుదర్శన్, మామడి సైదులు, లక్ష్మయ్య, గ్రామ పెద్దలు ఉన్నారు.

టీడీపీ హయాంలోనే అభివృద్ధి

చిలుకూరు : మండలంలోని రామాపురం గ్రామంలో శనివారం టీడీపీ నాయకులు ఇంటింటికి టీడీపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ పార్టీ సభ్యత్వాలు నమోదు చేశారు. టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి గురించి తెలియజేశారు. వైస్ ఎంపీపీ జనపనేని జానకీకృష్ణారావు, పార్టీ కోదాడ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఓరుగంటి ప్రభాకర్, మండలఅధ్యక్షుడు దొడ్డా గురవయ్య, నాయకులు సురేష్, లింగయ్య, రామారావు, మోహన్‌రావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.